## క్లుప్తంగా

### పారిశుధ్య పనులు చేపట్టాలి


వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీపీవో

జైపూర్: గ్రామాల్లో ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టాలని మురికికాల్వలు, రోడ్లు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి డి.వెంకటేశ్వర్‌రావు తెలిపారు. మండలంలోని ఇందారం గ్రామ పంచాయతీని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను పరిశీలించి ఎక్కడా చెత్తాచెదారం ప్లాస్టిక్ వ్యర్థాలు లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మురుగు కాలువల్లో దోమలు పెరగకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. సీజన్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలను అప్రమత్తం చేయాలని వైద్యసిబ్బందికి సూచించారు. అనంతరం టేకుమట్ల గ్రామ పంచాయతీని సందర్శించారు. ఆయనతో ఎంపీడీవో సత్యనారాయణ, పంచాయతీకార్యదర్శి సుమన్, శ్రావణి, ఏఎన్ఎం కృష్ణవేణి ఉన్నారు.

### సైన్స్‌పై అవగాహన


అవగాహన కల్పిస్తున్న డీఎస్‌వో

నెన్నెల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలోని విద్యార్థులకు జిల్లా స్థాయి విజ్ఞాన సంచార విజ్ఞాన ప్రయోగశాల నిర్వాహకుడు సాయికుమార్, సంపత్‌లు జిల్లా విద్యాధికారి యాదయ్య ఆదేశాల మేరకు డీఎస్‌వో సైన్స్‌పై అవగాహన కల్పించారు. రసాయనశాస్త్ర ప్రయోగాలు మానవ శరీర అంతర్గత అవయవాల పనితీరు ప్రయోగశాల పరికరాలు వాటి పని విధానాలపై వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ప్రకాష్‌రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### కళాకారులకు న్యాయం చేయండి

జన్నారం: గత ప్రభుత్వం కళాకారులను మోసం చేసిందని, ఇందిరమ్మ రాజ్యంలోనైనా కళాకారులకు న్యాయం జరిగేలా చూడాలని ఆదర్శ కళాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు లింగంపల్లి రాజలింగు అన్నారు. మండల కేంద్రంలోని పీఆర్టీయూ భవన్‌లో గురువారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి కళాకారుల సమావేశానికి వివిధ మండలాల నుంచి కళాకారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ధూందాం కళాకారులకు ప్రభుత్వ ఉద్యోగాలు లేదా ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చి మోసగించిందన్నారు. రాష్ట్ర సాధనలో కీలకంగా వ్యవహరించిన కళాకారులు రోడ్డున పడ్డారన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన కళాకారులను గుర్తించి, సారథిలో ఉద్యోగాలు ఇప్పించాలన్నారు. సమావేశంలో ఉమ్మడి జిల్లాకు చెందిన కళాకారులు మధు, లక్ష్మణ్, సంధ్య, నరేశ్, సత్యం, వెంకటేశ్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

### కఠిన చర్యలు తీసుకోవాలి

లక్సెట్టిపేట: ఈ నెల 17వ తేదీన మృతి చెందిన బోల్ల వ్యాపారి ప్రతాప్ మృతికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మృతుడి భార్య ఉమ కుటుంబీకులు గురువారం విలేకరుల సమావేశంలో తెలిపారు. తన భర్త మృతి చెందడానికి కారకులైన వారిపై పోలీసులు కేసు నమోదు చేయాలని, కొంతమంది వ్యక్తులు తన భర్తను డబ్బుల కోసం వేధించారని మరణవాంగ్మూలంలో రాశాడన్నారు. మృతి చెందడానికి ఆయనపై ఒత్తిడి తీసుకొచ్చి డబ్బుల కోసం వేధించారన్నారు. తన భర్త మృతి చెందడంతో కుటుంబం ఇబ్బందుల పాలైందని ఆవేదన వ్యక్తం చేశారు. రాసిన లేఖ ఆధారంతో పోలీసులు కఠిన చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరారు.

### 'దుష్ప్రచారాలు చేస్తే సహించేది లేదు'

తాండూర్: అంబేడ్కర్ విగ్రహం విషయంలో అంబేడ్కర్ సంఘం నాయకులపై దుష్ప్రచారాలు చేస్తే సహించేది లేదని ఆ సంఘం నాయకులు హెచ్చరించారు. తాండూర్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం మాట్లాడారు. గతంలో తాండూర్ ఐబీ మండల కేంద్రంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహాన్ని జాతీయ రహదారి నిర్మాణ పనుల సమయంలో బుధవారం సంత వద్దకు తరలించే క్రమంలో విగ్రహం పలు చోట్ల విరిగిపోయినట్లు తెలిపారు. అందరి నిర్ణయం మేరకే వేరే చోటికి తరలించాం కానీ, తామెవరం ధ్వంసం చేయలేదన్నారు. ఇప్పటికే నూతన విగ్రహం కోసం అడ్వాన్స్ చెల్లించినట్లు, త్వరలోనే విగ్రహ ఏర్పాటుకు చర్యలు చేపడతామన్నారు. సమావేశంలో అంబేడ్కర్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

# రైతు రుణమాఫీపై హర్షం


కన్నెపల్లి రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్


తాండూర్‌లో...


వేమనపల్లిలో...


కిష్టంపేటలో...


కోటపల్లి: సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ సతీశ్‌కుమార్, తదితరులు

భీమిని/తాండూర్/నెన్నెల/వేమనపల్లి/కోటపల్లి/భీమారం/చెన్నూర్‌రూరల్/కాసిపేట/మందమర్రిరూరల్/చెన్నూర్: రాష్ట్ర ప్రభుత్వం తొలి విడత రూ.లక్ష లోపు రుణమాఫీ చేసిన సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఆయా గ్రామాల రైతువేదికల్లో గురువారం రైతులు, ప్రజాప్రతినిధులు, నాయకులు సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రుణమాఫీని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని అధికారులు, రైతులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారు. అనంతరం రైతులు బాణాసంచాలు పేల్చి సంబురాలు జరుపుకున్నారు. మిఠాయిలు పంచారు. ముఖ్యమంత్రి, ఎమ్మెల్యేల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కోటపల్లిలో మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్ మాట్లాడుతూ.. రైతుల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమని, ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేస్తున్న పార్టీ కాంగ్రెస్‌నే అని అన్నారు. ఈ సందర్భంగా కోటపల్లి రైతువేదిక ఆవరణలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

### సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం


కోటపల్లి: క్షీరాభిషేకం చేస్తున్న ఆర్ఎంపీలు

కోటపల్లి/నెన్నెల: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆర్ఎంపీ, పీఎంపీలకు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్స్ అందజేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించడంతో కోటపల్లి, నెన్నెల మండలాల అనుభవ వైద్యులు గురువారం ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.


క్షీరాభిషేకం చేస్తున్న నెన్నెల ఆర్ఎంపీలు


భీమారంలో క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు


వేమనపల్లి: సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం


ఎర్రగుంటపల్లిలో...


చెన్నూర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో...


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు

### గంగమ్మా.. సల్లంగా చూడమ్మా


నృత్యం చేస్తూ బోనాలతో వెళ్తున్న భక్తులు

వేమనపల్లి: రాత్రి, పగలు తేడా లేకుండా నదిలో చేపలు పడుతూ, పుష్కరఘాట్ వద్ద పడవల సహాయంతో ప్రాయాణికులను చేరవేస్తూ ఉంటాం .. తల్లీ మమ్మల్ని సల్లంగా చూడు అని జాలర్లు ప్రాణహిత (గంగమాత)కు మొక్కులు సమర్పించారు. వేమనపల్లి మండల కేంద్రంలోని జాలరివాడలోని పోచమ్మవాడ, చింతవాడకు చెందిన సుమారు 250జాలర్ల కుటుంబాలు గురువారం ప్రాణహిత తల్లికి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామం నుంచి డీజే చప్పుళ్లతో నృత్యాలు చేస్తూ మహిళలు మంగళహారతులతో బోనాలతో నదికి తరలివెళ్లారు. ఇసుక తిన్నెలపై బోనం పోసి నైవేద్యం వండిపెట్టారు. కోళ్లు, మేకలు బలిచ్చి, కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఏడాదికి ఒకసారి ప్రాణహిత నదికి కొత్త నీళ్లు వచ్చే సమయంలో గంగమ్మ తల్లికి మొక్కులు చెల్లిస్తామని జాలర్లు తెలిపారు.

### శాంతిభద్రతల పరిరక్షణకే కార్డన్ సెర్చ్


సుభద్రకాలనీ వాసులతో మాట్లాడుతున్న సీఐ

తాండూర్: సమాజంలో శాంతి భద్రతలను పరిరక్షించేందుకు, రక్షణ వ్యవస్థను పటిష్ఠ పర్చేందుకే కార్డన్ సర్చ్ నిర్వహిస్తున్నామని తాండూర్ సీఐ కుమారస్వామి అన్నారు. మండల కేంద్రంలోని సుభద్ర కాలనీలో గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్రతీ ఇంటిని క్షుణ్ణంగా పరిశీలించారు. రిజిస్ట్రేషన్ పత్రాలు, నంబర్ ప్లేట్స్ సరిగ్గా లేని వాహనాలను సీజ్ చేశారు. కార్యక్రమంలో తాండూర్, భీమిని, కన్నెపల్లి ఎస్సైలు కిరణ్‌కుమార్, విజయ్‌కుమార్, గంగారాం, సిబ్బంది పాల్గొన్నారు.

## అసాధ్యాన్ని సుసాధ్యం చేశాం..

- ప్రతీరైతుకు రుణమాఫీ వర్తింపజేస్తాం
- ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ప్రభుత్వం తాజాగా ప్రకటించిన రైతు రుణమాఫీ పథకం ప్రతీరైతుకు వర్తించేలా చూస్తామని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. హాజీపూర్ మండలం గుడిపేటలోని రైతువేదికలో గురువారం సీఎం చిత్రపటానికి ఆయన క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసాధ్యాన్ని సుసాధ్యం చేసి చూపించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే అన్నారు. ఇచ్చిన హామీ మేరకు


క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

రుణమాఫీ అమలు చేసి విమర్శలు చేస్తున్న వారి నోర్లు మూయించామన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి సురేఖ, ఉద్యానవన అధికారి సహజ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

## డ్రగ్స్‌కు బానిసై జీవితాలు నాశనం చేసుకోవద్దు


బెల్లంపల్లి: మాట్లాడుతున్న సీఐ అఫ్జలొద్దీన్


రామకృష్ణాపూర్: మాట్లాడుతున్న సీఐ

- విద్యార్థులకు పోలీసుల సూచన
- పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన సదస్సులు

కాసిపేట/భీమిని/మంచిర్యాలరూరల్(హాజీపూర్)/కోటపల్లి/నెన్నెల/శ్రీరాంపూర్/బెల్లంపల్లి/దండేపల్లి/రామకృష్ణాపూర్/నస్పూర్: యువత మత్తు పదార్థాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని పోలీసులు సూచించారు. పలు మండల కేంద్రాల్లో ప్రజలకు, పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు పోలీసుల ఆధ్వర్యంలో డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన సదస్సులు నిర్వహించారు. యువత గంజాయి, డ్రగ్స్ బారిన పడి బంగారు భవిష్యత్‌ను అంధకారం చేసుకోవద్దని సూచించారు. గంజాయి అమ్మినా, కొనుగోలు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్కడైనా గంజాయి వాడుతున్నట్లు తెలిస్తే 100కు ఫోన్ చేసి సమాచారం అందించాలని వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. కార్యక్రమాల్లో బెల్లంపల్లిలో రూరల్ సీఐ అఫ్జలుద్దీన్, టూటౌన్ ఎస్సై రమేష్, తాళ్ల గురిజాల ఎస్సై జి.నరేష్‌కుమార్, రామకృష్ణాపూర్‌లో మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్సై రాజశేఖర్, కాసిపేటలో ఎస్సైలు ఆంజనేయులు, ప్రవీణ్‌కుమార్, భీమిని, కన్నెపల్లి ఎస్సైలు విజయ్‌కుమార్, గంగారాం, హాజీపూర్‌లో ఎస్సై గోపతి సురేశ్, కోటపల్లిలో ఎస్సై రాజేందర్, శ్రీరాంపూర్‌లో ఎస్సై సంతోశ్‌కుమార్, దండేపల్లిలో ఎస్సై ఉదయ్‌కిరణ్, నస్పూర్‌లో ఎస్సై సుగుణాకర్, యువకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఏర్పర్చుకోవాలి

తాండూర్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పర్చుకుని చదువులో అత్యున్నత స్థాయిలో రాణించాలని సెక్టోరల్ అధికారి యశోదర అన్నారు. మండలంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని గురువారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా సీఈసీ విద్యార్థులకు లా సెట్ కోచింగ్ తరగతులను ప్రారంభించారు. అనంతరం పాఠశాల పరిసరాలను తనిఖీ చేసి అధికారులకు సూచనలు చేశారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న సెక్టోరల్ అధికారి

## పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

- బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్

బెల్లంపల్లి: పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. బెల్లంపల్లి తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆర్డీవో హరికృష్ణతో కలిసి వినోద్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రణాళికబద్ధంగా పనిచేస్తోందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వరుసక్రమంగా అమలు చేస్తోందన్నారు. ఇప్పటికే ఆరు గ్యారంటీలను అమలు చేసి పేదలకు ప్రయోజనం కలిగించిందన్నారు. రైతుల కోరిక ప్రకారంగా ఏకకాలంలో రూ.2లక్షల వరకు పంట రుణాలను మాఫీ చేయడం దేశంలోనే ప్రథమమని పేర్కొన్నారు. జీఓ నంబర్ 76 కింద బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలో నివాసం ఉంటున్న 64మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, తహసీల్దార్ కేవై ప్రసాద్, పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ శ్రేణులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే వినోద్

తాండూర్: పేదింటి ఆడపడుచులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. తాండూర్ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. తనను ఆదరించిన తాండూర్ మండల ప్రజలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని, తాండూర్ మండలం అభివృద్ధికి అహర్నిశలు పాటుపడుతానని స్పష్టం చేశారు. రాజీవ్‌నగర్‌లో వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. అనంతరం తాండూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి ఎమ్మెల్యే వినోద్, స్థానిక నాయకులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఏసీపీ రవికుమార్, ఆర్డీవో హరికృష్ణ, తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్, ఎంపీడీవో శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సూరం రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**విద్యుత్ సౌకర్యం కల్పించాలని వినతి**

తాండూర్: మండలంలోని కొత్తపల్లి శివారులో గల ఇందిరమ్మ కాలనీలో విద్యుత్ సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యే వినోద్‌కు వినతి పత్రం అందించగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, స్థానిక అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారమయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు.

**ప్రభుత్వ భూమి కేటాయించాలని వినతి**

బెల్లంపల్లి: మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల విద్యాలయానికి పక్కా భవనం నిర్మాణం కోసం ప్రభుత్వ స్థలం కేటాయించాలని బెల్లంపల్లి జ్యోతిబాపూలే గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్ రమాదేవి కోరారు. ఎమ్మెల్యే వినోద్‌కు ఆమె వినతి పత్రం అందజేశారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.


పీరీల వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే

### ఘనంగా మొహర్రం ముగింపు

చెన్నూర్/జన్నారం: పట్టణంలోని గచ్చిమసీదు, రజకవాడ, లైన్‌గడ్డ, జెండావాడ, గాంధీ చౌక్‌లలో తొమ్మిది రోజులుగా పీరీలను ఏర్పాటు చేసి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. పీరీల ముగింపు వేడుకలను గురువారం ఘనంగా జరుపుకున్నారు. పీరీలతో ఊరేగింపుగా వెళ్లి పెద్ద చెరువులో నిమజ్జనం చేశారు. జన్నారం మండలంలోని కామన్‌పల్లిలో జరిగిన మొహర్రంలో ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్ పాల్గొన్నారు. పూజలు చేశారు.

## పోడు రైతులకు పట్టాలివ్వించండి

- బీజేపీ నాయకుల డిమాండ్

చెన్నూర్: నియోజకవర్గంలోని చెన్నూర్, కోటపల్లి, భీమారం, జైపూర్ మండలాల్లోని రైతులు 40 ఏళ్లకు పైగా పోడు భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని, స్థానిక ఎమ్మెల్యేకు రైతులపై ప్రేమ ఉంటే నియోజకవర్గంలోని రైతులకు పట్టాలు ఇప్పించాలని బీజేపీ పెద్దపల్లి పార్లమెంట్ కన్వీనర్ నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ అన్నారు. చెన్నూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అస్సాదలో పోడు భూముల సమస్యను పరిష్కరించామని చెప్పుకుంటున్న కాంగ్రెస్ నాయకులకు చెన్నూర్, కోటపల్లి మండలాలలో ఉన్న పోడు రైతులు కన్పించడం లేదా అని ప్రశ్నించారు. రైతుల సమస్యలు పరిష్కరించాలని ప్రశ్నించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడిపై కాంగ్రెస్ నాయకులు మాట్లాడడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు మంత్రి రామయ్య, రాపర్తి వెంకటేశ్వర్, కొండపాక చారి, కమ్మల శ్రీనివాస్, గర్రెపల్లి నర్సయ్య, కాశెట్టి నాగేశ్వర్‌రావు, శివకృష్ణ, మోహన్‌రెడ్డి, శ్రీపాల్, విష్ణు, చిరంజీవి, సాయికృష్ణ, శ్రీవర్ధన్‌లు పాల్గొన్నారు.


కోటపల్లి: మాట్లాడుతున్న కార్యదర్శి రవి

**'రైతులను ఇబ్బంది పెడుతున్న ప్రభుత్వాలు'**

కోటపల్లి: పోడు సాగుచేసుకుంటున్న రైతులకు హక్కు పత్రాలివ్వకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇబ్బందులకు గురిచేస్తున్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి అన్నారు. సర్వాయిపేటలో సీపీఎం పార్టీ, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో గురువారం సమావేశం నిర్వహించగా పార్టీ జిల్లా కార్యదర్శి సంకె రవి మాట్లాడారు. అటవీశాఖ అధికారులు బొప్పారంలో పత్తిపంటకు గడ్డిమందు కొట్టి నాశనం చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. బాధ్యులపై విచారణ జరిపి పత్తిపంటను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాస్, రవి, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్మపున్నం, రైతులు పాల్గొన్నారు.

## అధికారిక కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధుల కుటుంబీకులు..!

బెల్లంపల్లి: ప్రభుత్వ అధికారిక కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధుల కుటుంబ సభ్యులు, పలువురు కాంగ్రెస్ శ్రేణులు భాగస్వామ్యం కావడం చర్చనీయాంశమైంది. బెల్లంపల్లి మండల తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో గురువారం లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు, ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ముఖ్య అతిథిగా హాజరు కాగా ఆర్డీవో పి.హరికృష్ణ, తహసీల్దార్ కే వై ప్రసాద్, మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత పలువురు మున్సిపల్ కౌన్సెలర్లు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులకు వరుస క్రమంగా చెక్కుల పంపిణీ చేపట్టారు. ఈ క్రమంలో పలువురు ప్రజా ప్రతినిధుల కుటుంబ సభ్యులు, మాజీ ప్రజా ప్రతినిధులు, ఇతర కాంగ్రెస్ శ్రేణులు సభా వేదిక మీదకు వచ్చి, అధికా రులు, ప్రజా ప్రతినిధులతో సమానంగా చెక్కులు అందించడానికి పోటీ పడ్డారు. కార్యక్రమం హడావుడిలో ప్రభుత్వ అధికారులు ఉండగా పనిలో పనిగా కొందరు ప్రజా ప్రతినిధుల కుటుంబ సభ్యులు, కాంగ్రెస్, అనుబంధ సంఘాల శ్రేణులు, బస్తీ, గ్రామాల నాయకులు తామే ప్రజా ప్రతినిధులైనట్లు సభా వేదికపై హల్‌చల్ చేయడం కనిపించింది. ఇంత జరుగుతున్న ఎమ్మెల్యే కానీ.. ఇతర ప్రభుత్వ అధికారులు కానీ.. ఆ విషయాన్ని గ్రహించి నిలువరించకపోవడం గమనార్హం. కాగా కొంతమంది మాజీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు ప్రోటోకాల్ ప్రకారంగా వ్యవహరించడం కనిపించింది. కార్యక్రమాల నిర్వహణలో ప్రభుత్వ అధికారులు ఇకపై తగిన శ్రద్ధ తీసుకుని, ఇలాంటి సంఘటనలు పునఃరావృతం కాకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.


చెక్కు అందించే క్రమంలో చైర్‌పర్సన్ పక్కన ఆమె భర్త